



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు

పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులలు సన్నద్ధం కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, నియమ నింబధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించి హోర్డింగులు, పోస్టర్లతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పకడ్బందీగా కోడ్ అమలయ్యే నిఘా బృందాలను అప్రమత్తం చేయాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోబాలకు గురిచేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను పరిశీలించి ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తయిందని, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్లు స్వీకరించాలని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనుగుణంగా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కబ్జాలపై చర్యలు తీసుకోండి


తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువులు, కుంటలు, నాలాల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని హైడ్రా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిప్రం అందజేశారు. జిల్లాలో పలు చోట్ల చెరువులు, కుంటలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, వీరికి పలు రాజకీయ నేతల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నెల 20, 21 తేదీల్లో తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత జిల్లాలో పర్యటించిన సందర్భంగా పలు చోట్ల ఆక్రమణలపై ఆమె దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు చుట్టుపక్కల చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురైనట్లు తెలిసిందన్నారు. పాత తేదీల్లో ఎన్‌వోసీలు తీసుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ఆయనవెంట తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, సీఎన్ విష్ణుమూర్తి, బాబురావు తదితరులు ఉన్నారు.

నారీ.. సారీ!



మహిళలకు పూర్తిగా దక్కని రిజర్వేషన్ ఫలాలు

- పంచాయతీ ఎన్నికల్లో గతంలో కంటే తగ్గిన స్థానాలు
- సర్పంచ్ స్థానాల్లో 46.95 శాతమే కేటాయింపు
- వార్డుల్లో 44.64 శాతంతో సరి
- జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు 526

స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు విషయంలో లెక్కలు తప్పుతున్నాయి. స్థానిక సంస్థల్లో వారికి సగం అవకాశాలు కల్పిస్తూ చట్టాలు చేసినా అమలులో మాత్రం వివక్ష జరుగుతూనే ఉంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న మహిళలకు కొన్ని ప్రాంతాల్లో నిరాశ ఎదురవుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు మంగళవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయగా నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. అయితే సగం స్థానాలు తమకే రిజర్వులవుతాయని భావించి ఎన్నికలకు సిద్ధమైన మహిళా నేతలకు రిజర్వేషన్లు కలిసిరావడం లేదు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

జిల్లాలో మొత్తం 526 పంచాయతీలు ఉండగా ఇందులో 50శాతం స్థానాలు అంటే 263 స్థానాలు మహిళలకు రిజర్వుడు చేయాలి. కానీ, 247 సర్పంచ్ స్థానాలు మాత్రమే మహిళలకు రిజర్వ్ చేశారు. మొత్తం స్థానాల్లో మహిళలకు దక్కిన రిజర్వేషన్ల ఫలాలు 46.95 శాతం కావడం గమనార్హం. సర్పంచ్ స్థానాల్లో జనరల్ స్థానాలు 53.05 శాతం కాగా, వార్డుల్లో 55.36శాతం కావడం గమనార్హం. గతంలో కంటే ఈసారి మహిళలకు

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో మహిళా రిజర్వేషన్లు ఇలా..

పదవులు	మొత్తం	మహిళలు	శాతం	జనరల్	శాతం
సర్పంచులు	526	247	46.95	279	53.05
వార్డు సభ్యులు	4,668	2,084	44.64	2,622	55.36

ఆయా వర్గాల్లో మహిళా రిజర్వేషన్లు(శాతంలో..)

పదవులు	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్
సర్పంచులు	46.15	48.11	45.65	47.25
వార్డు సభ్యులు	46.88	42.00	40.84	46.69

కోడ్ కూసిన వేళ.. పార్టీ గుర్తులకు ముసుగు



కేశంపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో బుధవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీలకు చెందిన గుర్తులు, గోడలపై రాతలను చెరిపి వేస్తున్నారు. ప్రముఖ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. గ్రామాల్లో పార్టీల జెండాలను కప్పివేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడంతో అనుమతులు లేకుండా గోడలపై పార్టీలకు సంబంధించి ప్రచారాలు రాయవద్దని అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామంలో పార్టీల జెండాలకు పంచాయతీ కార్యదర్శులు ముసుగులు తొడిగారు.



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న గుజ్జల మహేశ్

ప్రగతిని కాంక్షించే వారినే గెలిపించాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ఆమనగల్లు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రగతిని కాంక్షించే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనకు వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళ్తున్న మంత్రి కడ్తాల్‌లోని రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఆసీఫ్‌అలీ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుజ్జల మహేశ్, ఆసీఫ్‌అలీ, కడ్తాల్, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, చెన్నకేశవులు, చీపునుంతల మాజీ సర్పంచ్ రఘుపతి, నాయకులు వెంకట్, రాజీరెడ్డి, శ్రీశైలం గౌడ్, నరేశ్, రాంచందర్‌నాయక్, ఇమ్రాన్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

విమానంలో మహిళతో అసభ్యకర ప్రవర్తన

- వ్యక్తిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): విమానంలో మహిళా ప్రయాణికురాలితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన బుధవారం ఆర్జీఐఏ ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుచిక కుండలియా అనే మహిళ జైపూర్ నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తోంది. ఈ క్రమంలో పక్క సీట్లో కూర్చున్న జగదీష్‌కుమార్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన మహిళ ఎయిర్‌లైన్స్ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. విమాన సిబ్బంది పైలెట్‌కు సమాచారం అందించారు. విమానం ఉదయం 8.21 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగానే ఎయిర్‌లైన్స్ సిబ్బంది ఆర్జీఐఏ ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగదీష్‌కుమార్‌ను పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పల్లె పోరు

- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి
- వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రదర్శన

ఈ రోజే తొలి విడత నోటిఫికేషన్ జారీ



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

నేటి నుంచి పంచాయతీ పోరు మొదలు కానుంది. జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంగళవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు గురువారం అధికారులు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అనంతరం వెంటనే నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మొత్తం 526 పంచాయతీలు

జిల్లాలో మొత్తం 526 పంచాయతీలు ఉండగా, వాటిలో మొదటి విడతలో 262 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే తొలి విడత ఎన్నికలు జరగనున్న పంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. గురువారం నుంచి శనివారం వరకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగనుంది. ఆ తర్వాత అర్హత కలిగిన నామినేషన్ల వివరాలను ప్రకటిస్తారు. కాగా, నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాలను డిసెంబరు ఒకటో తేదీన ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. 3వ తేదీ, మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణకు

మిగతా 8వ పేజీలో...

తొలి విడత ఇలా...

రెవెన్యూ డివిజన్లు : షాద్‌నగర్, రాజేంద్రనగర్
మండలాలు : కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్, శంషాబాద్

పంచాయతీలు 174
వార్డులు 1,530
పోలింగ్ కేంద్రాలు 1,530

అత్తా.. కోడలా?

- ఎస్టీ మహిళకు కోనాపూర్ సర్పంచ్ రిజర్వుడ్
- ఆ గ్రామంలో ఒక్కటే ఎరుకల కుటుంబం
- వారికే రెండోసారి అవకాశం

7

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

యాచారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ యువతి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాల్ గ్రామంలో చోటుచేసుకుంది. మాల్‌కు చెందిన సింధు(20) కొంతకాలంగా మండలంలోని గున్‌గల్ గ్రామంలో తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ నగరంలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం తన స్వగ్రామమైన మాల్‌కు వచ్చింది. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తమకు తెలియదని కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు తెలిపారు.



వేంకటేశ్వరుడి పల్లకీసేవలో భక్తులు

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి ముఖ ద్వారంగా వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం ఆలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం చేశారు.

న్యాయమైన పరిహారం అందిస్తేనే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు

- గ్రామ సభలో తేల్చిచెప్పిన మర్రిపల్లి రైతులు
- అంగీకరిస్తే ఎకరాకు రూ.30 లక్షలన్న అధికారులు
- రూ.90 లక్షలు డిమాండ్ చేసిన అన్నదాతలు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): న్యాయమైన పరిహారం అందిస్తే తప్ప గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు భూములు ఇవ్వమని కడ్తాల మండలం మర్రిపల్లి గ్రామ రైతులు తేల్చి చెప్పారు. ఒకే జిల్లా పరిధిలో నిర్మిస్తున్న రోడ్డుకు ఒక చోట ఒక విధంగా పరిహారం అందించడం ఏమిటని ప్రశ్నించారు. కొంగరకలాన్‌లో ఇస్తున్న మాదిరిగా ఎకరాకు రూ.90 లక్షలు, ఒక ప్లాట్ ఇవ్వాలని భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేశారు. కడ్తాల మండలం మర్రిపల్లిలో బుధవారం గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ రేటును బట్టి ఎకరాకు రూ.8.47 లక్షలు వస్తుందని, కానీ, రైతులు అంగీకరించి ముందుకు వస్తే రూ.30 లక్షల వరకు ఇవ్వడానికి కలెక్టర్ నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంతో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది కాబట్టి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములు ఇవ్వాలని కోరారు. రైతులు ఒక నిర్ణయానికి వచ్చి అభిప్రాయాన్ని చెప్పాలని కోరారు. తదుపరి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్ఐ వరప్రసాద్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

'దీక్షా దివస్'ను విజయవంతం చేయాలి

శంషాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఈనెల 29న నిర్వహించే బీఆర్ఎస్ దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కేసీఆర్ దీక్ష వల్లనే తెలంగాణ వచ్చిందని గుర్తుచేశారు. ఏ పార్టీ నేతలను సంప్రదించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసిందన్నారు. ఆ ప్రభుత్వానికి ఎక్కడ కూడా అప్పులు దొరకడం లేదన్నారు. రంగారెడ్డి జిల్లా ఫర్ సేల్ అనే నినాదంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఫ్యూచర్‌సిటీ అని చెపుతున్నా.. అక్కడ ఏమీలేదని, కోకాపేట్‌లోని భూములను కూడా రేవంత్ సర్కార్ ఎప్పుడో అమ్మేసిందన్నారు. అభివృద్ధిలో ముందున్న రంగారెడ్డి జిల్లాను గ్రేటర్‌లో విలీనం చేశాక.. ప్రభుత్వం తాకట్టు పెట్టి అప్పుతేవడానికి విశ్వప్రయత్నం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మోహన్‌రావు, జిల్లా, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలతో వాసవి క్లబ్‌లను ప్రత్యేక గుర్తింపు లభిస్తున్నదని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అన్నారు. షాద్‌నగర్ వాసవి, వనితా క్లబ్ చేసిన పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించి అభినందించారు. దాతల సహకారంతో షాబాద్ మండలం కుర్వగూడ, సర్దార్‌నగర్‌లలో నిర్మించిన బస్సు షెల్టర్‌ను పరిశీలించారు. అనంతరం దాత ఎల్కుర్తి నారాయణ ఆయన కుమారుడు ఎల్కుర్తి శ్రీనివాసులు షాద్‌నగర్ విష్ణు సహస్రనామ పారాయణ కమిటీ భవనం కోసం ఇచ్చిన 215 గజాల స్థల రిజిస్ట్రేషన్ పత్రాలను పారాయణ కమిటీ అధ్యక్షుడు స్వరాజ్‌బాబుకు అందజేశారు. విష్ణు సహస్రనామ పారాయణ కమిటీ భవన నిర్మాణం కోసం డాక్టర్ గుడిపాటి సురేష్, నిర్మల దంపతులు రూ.లక్షా 11 వేల విరాళం ఇచ్చారు. పారాయణ భవనం మొదటి దశ నిర్మాణంలో 20శాతం నిధులను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నుంచి కేటాయిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఆనంతం, కార్యదర్శి సంతోష్, ఇంటర్నేషనల్ వైస్ ప్రసిడెంట్ దొంతు పాండురంగయ్య, సురిశెట్టి నర్సింహ్మగుప్త, ఎలుకుర్తి శ్రీనివాస్, కల్వ మాణిక్యం, కల్వ మధుప్రియ, గుడిపల్లి వెంకటరమణ, కొండ రమ, విజయలక్ష్మీ, జి. సురేష్, స్వప్నకుమార్, కె. నవీన్‌కుమార్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.


ప్లాటు రిజిస్ట్రేషన్ పత్రాలను ఇస్తున్న ఇరుకుల రామకృష్ణ

కిరోసిన్ పోసుకుని కార్మికుడి హల్‌చల్

- నైట్ డ్యూటీ నుంచి విముక్తి కల్పించాలని విన్నపం
- అధికారి ఒప్పుకోవడం లేదని ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రికి తరలించిన సిబ్బంది

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తాను నైట్ డ్యూటీ చేయనని ఓ కార్మికుడు కిరోసిన్ పోసుకుని హల్‌చల్ చేసిన ఘటన వికారాబాద్ మునిసిపాలిటీలో చోటుచేసుకుంది. వికారాబాద్‌కు చెందిన సత్తయ్య మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నాలుగేళ్లుగా నైట్ వాచ్‌మన్‌గా ఉంటున్నాడు. బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాస్‌ను కలిసి తాను నైట్ డ్యూటీ చేయనని, తన భార్య ఆరోగ్యం బాగలేదని విన్నవించాడు. మరి ఎక్కడ పనిచేస్తావో పేర్కొంటూ పేపర్‌పై రాసివ్వాలని ఏసుదాసు తెలుపడం సత్తయ్య దురుసుగా మాట్లాడుతూ కిరోసిన్ పోసుకున్నాడు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది అతడిని అడ్డుకొని తోసేసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కమిషనర్ జకీర్‌అహ్మద్ వివరణిస్తూ.. అధికారులు, సిబ్బంది మధ్య ఏమైనా విభేదాలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ విషయంలో విభాగ సభ్యులతో మాట్లాడానని, సత్తయ్య ఆవేశంతో అలా చేశాడని అన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడ్యుకేటర్ సురేష్

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మేనేజ్‌మెంట్ ఎడ్యుకేటర్ ప్రొఫెసర్ సురేష్ తెలిపారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం కేస్ మెథడ్ ఆఫ్ టీచింగ్ ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అంశంపై ఇన్-హౌస్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ ప్రోగ్రాంలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. సీపీ ఆదేశాల మేరకు బుధవారం షాబాద్ మండలంలో 7 టీంలుగా ఏర్పడి నాకాబందీ నిర్వహించారు. ముగ్గురు ఏసీపీలు, 9 మంది సీఐలు, 18 మంది ఎస్ఐలు, 100 మంది పోలీసులతో 7 బృందాలుగా ఏర్పడి 472 వెహికిల్స్ చెకింగ్ చేయగా.. 26 నెంబర్‌ప్లేట్స్ లేనివి, పత్రాలు లేనివి, 6 లైసెన్స్ లేనివి సీజ్ చేశారు. అనుమతి లేని రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నిల దృష్ట్యా చెక్‌పోస్టులు పెట్టామని, ఒక వ్యక్తి రూ.50 వేలకంటే ఎక్కువ తీసుకెళ్లద్దని డీసీపీ సూచించారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అడిషనల్ డీసీపీ కళింగరావు, ఏసీపీలు శ్రీనివాస్, కిషన్, రమణగౌడ్, షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ యోగేశ్ గౌతమ్


ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

టీచర్లకు 'టెట్' మినహాయింపు ఇవ్వాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చూడాలని మేడ్చల్ జిల్లా టీపీయూఎస్ నాయకులు బుధవారం మాల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మునీరాబాద్‌లో ఈటల నివాసంలో ఆయనను కలిశారు. లోక్‌సభ శీతాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నవీన్, శ్రీధర్, గోపాల్, సురేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాలి


ప్రమాణం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

యాలాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక హక్కులపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాలాల మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికను చదివించి ప్రమాణం చేశారు. దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్ర ను విద్యార్థి దశ నుంచే నేర్పాలని, కేరళ తరహా పాఠ్యాంశాలను రూపకల్పన చేసి బోధించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరేందర్, బాలప్ప పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన


పూజల్లో భక్తులు.. గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారంలో ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయంలో హోమం, గోమాత, గణపతి పూజలు, దేవతామూర్తుల ఊరేగింపు, మహిళలు జలాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ట్రెసా జిల్లా అధ్యక్షుడికి సన్మానం


ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జి.విజయేందర్‌ను బుధవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. విజయేందర్ ఉద్యోగ పరంగా, సంఘ పరంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ అనిల్, ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, రత్నయ్య, ప్రేమ్, రమేశ్, రాంచందర్, భరత్, అశోక్ పాల్గొన్నారు.


పర్సాపూర్‌లో సైడ్ డ్రైనేజీపైకి దుసుకెళ్లిన టిప్పర్

రోడ్డు పనులను వేగవంతం చేయాలి

కొడంగల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పర్సాపూర్ గుండా వెళ్తున్న 163 నేషనల్ హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పనులు నత్తనడకన కొనసాగడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే బుధవారం కంకర్ లోడ్ టిప్పర్ అదుపుతప్పి రోడు పక్కన కడుతున్న డ్రైనేజీలోకి దుసుకెళ్లింది.

అండర్-17 చాంపియన్‌గా 'పరిగి'


విజేతగా నిలిచిన జట్టు

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 క్రికెట్ పోటీల్లో పరిగి జట్టు విజేతగా నిలిచింది. పరిగి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో పరిగి, వికారాబాద్, తాండూరు, పెద్దేముల్, మోమిన్‌పేట్ జోన్‌లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో పరిగి-వికారాబాద్ తలపడ్డాయి. పరిగి జట్టు గెల్చింది. పరిగి జట్టును షీల్డ్, మెమొంటోలను అందజేశారు.


నిరసన తెలుపుతున్న సాకేత్ ప్రణామం నివాసితులు

రోడ్డును ప్లాటుగా మార్చితే సహించం

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు స్థలాన్ని బిల్డర్ ప్లాటుగా మార్చి విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సాకేత్ ప్రణామం అపార్ట్‌మెంట్ సొసైటీ కార్యదర్శి వల్లభేంద్ర రెడ్డి, డైరెక్టర్ శేషసాయి అన్నారు. బుధవారం బిల్డర్ తీరును నిరసిస్తూ అతడి కార్యాలయం వద్ద నిరసన చేశారు. వారు మాట్లాడుతూ... తమ అపార్ట్‌మెంట్‌కు ఏర్పాటుచేసిన రోడ్డును మూసి వేసే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. ప్లాట్ల విక్రయం పూర్తయిన వెంటనే బిల్డర్ రోడ్డు స్థలాన్ని సైతం అమ్మకానికి పెట్టాడని ఆరోపించారు. ఈ రోడ్డు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ మ్యాప్‌లోనూ ఉందన్నారు. ఈ విషయంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



నేడు మంచి రోజు..

సప్తమి కావడంతో అధిక నామినేషన్ల దాఖలుకు అవకాశం

తాండూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తొలి విడత సర్పంచ్ ఎన్నికలు డిసెంబరు 11వ తేదీనే ఉండటంతో గ్రామాల్లో నాయకులు, ఆశావహులు ఉరుకుల పరుగులు పెడుతున్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులను ఖరారుకు ఎక్కువ సమయం లేక బుధవారం అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేపట్టారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 27 నుంచి 29 వరకే ఉంది. ఈ 27వ తేదీ సప్తమి రోజు మంచిదని నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. 28న అష్టమి, 29న నవమి ఉన్నందున హిందూ సిద్ధాంతాలు, తిథులు, నక్షత్రాలు, ఆచారాలు, గ్రహచారాన్ని నమ్మే వారు ఆ రోజుల్లో నామినేషన్లకు ఆసక్తి చూపరు. కాబట్టి మొదటి రోజే మంచి రోజని ఎక్కువ మంది నామాంకనాలు వేసే అవకాశం ఉంది. అయితే ఇలాంటి నమ్మకాలను పట్టించుకోని వారు మాత్రం మూడు రోజుల్లో ఎప్పుడైనా నామినేషన్ వేస్తారు.

ఇబ్బంది లేకుండా ఎన్నికలను నిర్వహించాలి



క్లస్టర్ అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి ఆయా క్లస్టర్లలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్‌లో మండలంలోని 33 పంచాయతీలను పది క్లస్టర్లుగా విభజించి సమీక్ష నిర్వహించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. పోలింగ్ విధానం, కౌంటింగ్, విజేతల ప్రకటనపై ఎన్నికల అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. 27వ తేదీ నుంచి ఆయా పంచాయతీల క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. గౌతాపూర్, జినగుర్తి, సిరిగిరిపేట్, బెల్కటూర్, చెంగోల్, నారాయణపూర్, అంతారం, కోటబాస్పల్లి, మల్కాపూర్, కరన్‌కోట్ క్లస్టర్లలో వాటి పరిధి పంచాయతీల నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. ఎవరూ మండల కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారులు వైజనాథ్, రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సాయిప్రజీత్, రవీందర్‌గౌడ్, సాయన్న, ఎ.శివకుమార్, నందినిరెడ్డి, శ్రావణ్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, నాగభూషణం ఉన్నారు. ఎన్నికల్లో పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని ఆదేశించారు.

సంగ్రామం 2025



క్లస్టర్ల వారీగా నామినేషన్ల స్వీకరణ

- నేటి నుంచి తొలివిడత నామినేషన్లు షురూ..
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు



చేవెళ్ల/శంషాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 25 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఎనిమిది క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఆలూరు క్లస్టర్ పరిధిలో ఆలూరు, అంతారం, హస్తేపూర్, కౌకుంట్ల క్లస్టర్ పరిధిలో కౌకుంట్ల, తంగడ్‌పల్లి గ్రామాలు వస్తాయి. కమ్మెట క్లస్టర్ పరిధిలో కమ్మెట, ఈర్లపల్లి, ఎన్కెపల్లి, గొల్లగూడ గ్రామాలు వస్తాయి. న్యాలట క్లస్టర్ పరిధిలో న్యాలట, తల్లారం, సింగప్పగూడ గ్రామాలు వస్తాయి. చన్వల్లి క్లస్టర్ పరిధిలోకి చన్వల్లి, బస్తేపూర్, మీర్జాగూడ, ఖానాపూర్ క్లస్టర్ పరిధిలోకి ఖానాపూర్, నాన్‌చెర్వు, రేగడి ఘనాపూర్, దేవరంపల్లి గ్రామాలు వస్తాయి. గుండాల క్లస్టర్ పరిధిలోకి గుండాల, అల్లావాడ గ్రామాలు, ముడిమ్యాల్ క్లస్టర్ పరిధిలోకి ముడిమ్యాల్, రావులపల్లి, గొల్లపల్లి, కుమ్మెర గ్రామాల వారీగా ఉండనున్నాయి. ఆయా క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు ఆ క్లస్టర్‌లోనే నామినేషన్ సమర్పించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. నామినేషన్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని పేర్కొన్నారు.


శంషాబాద్‌లో ఏడు క్లస్టర్లలో..

శంషాబాద్ మండలంలో గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమవుతోంది. మొత్తం 21 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు, 190 వార్డు సభ్యులకు నామినేషన్లు వేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం ఏడు క్లస్టర్లలో నామినేషన్లు దాఖలు కానున్నాయి. పెద్దషాపూర్ క్లస్టర్‌లో పెద్దషాపూర్, పెద్దషాపూర్ తండా, అల్లీకోల్‌తండా, నర్కూడ క్లస్టర్‌లో నర్కూడ, చౌదరిగూడ, కవ్వగూడ, సుల్తాన్‌పల్లి క్లస్టర్‌లో సుల్తాన్‌పల్లి, ననాజీపూర్, కాచారం. రామాంజాపూర్ క్లస్టర్‌లో రామాంజాపూర్, బోటిగూడ, మల్కారం, పెద్దతూప్ర క్లస్టర్‌లో పెద్దతూప్ర, పెద్దతూప్ర తండా, ముచ్చింతల్, మదన్‌పల్లి క్లస్టర్‌లో మదన్‌పల్లి మదన్‌పల్లి కొత్త తండా, మదన్‌పల్లి పాత తండా, పాల్మాకుల క్లస్టర్‌లో పాల్మాకుల, జూకల్, పిల్లోనిగూడ వస్తాయి. ఆయా క్లస్టర్లలో సర్పంచ్ స్థానాలకు, వార్డులకు నామినేషన్లు దాఖలు చేయొచ్చని ఎంపీడీవో మున్ని పేర్కొన్నారు.

అత్తా.. కోడలా?

ఎస్టీ మహిళకు కోనాపూర్ సర్పంచ్ రిజర్వ్‌డ్

- గ్రామంలో ఒక్కటే ఎరుకల కుటుంబం
- రెండోసారి ఆ కుటుంబంలోనే సర్పంచ్‌గా అవకాశం



కోనాపూర్ పంచాయతీ కార్యాలయం



సర్పంచ్‌గా అవకాశం లభించిన బెల్లకొండ కుటుంబం

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ రెండోసారి ఆ కుటుంబానికి సర్పంచ్ రూపంలో కలిసొచ్చింది. గ్రామ పంచాయతీ మొత్తంగా రెండే గిరిజన మహిళా ఓటర్లు ఉండడంతో అత్తా.. కోడలా? సర్పంచ్ ఎవరనే చర్చ గ్రామంలో సాగుతోంది. రిజర్వేషన్ పరంగా గతంలోనూ ఆ కుటుంబానికి సర్పంచ్‌గా అవకాశం లభించింది. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో 1125 మంది ఓటర్లకు గాను.. 541 మంది పురుషులు, 584 మంది స్త్రీలు ఉన్నారు. పంచాయతీ రిజర్వేషన్లలో భాగంగా గ్రామ పంచాయతీని ఎస్టీ మహిళకు కేటాయించారు. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క ఎరుకల కుటుంబానికి సర్పంచ్‌గా అవకాశం లభించింది. అందులో బెల్లకొండ రాములమ్మ, ఆమె కుమారుడు బెల్లంకొండ సైదులు, కోడలు బెల్లంకొండ శ్రీలత పేర్లు ఉన్నారు. 2013లో ఎస్టీ మహిళ రిజర్వేషన్ మూలంగా బెల్లంకొండ రాములమ్మ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం గ్రామంలో రెండే మహిళా ఓట్లు ఉండడంతో అత్తా కోడలు రాములమ్మ, శ్రీలత ఇద్దరిలో ఎవరో ఒకరు సర్పంచ్ కానున్నారు.

గతంలో రాములమ్మ సర్పంచ్‌గా పని చేసినందున ఈ దఫా శ్రీలతకు అవకాశం కల్పించాలనే చర్చ సాగుతోంది. ఆ కుటుంబంలోని అత్త కోడళ్లలో ఎవరో ఒకరు తప్పుకుంటే మరొకరు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. అయితే, శ్రీలత సర్పంచ్‌గా ఏకగ్రీవంగా అయ్యే అవకాశం ఉంది.

కౌకుంట్లలో ఎస్సీలకు నో రిజర్వేషన్

చేవెళ్ల, నంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉండగా 35,438 మంది ఓటర్లు ఉన్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని ఎన్నికలను రెండో విడత డిసెంబరు 11వ తేదీన నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. అయితే మండలంలోని కౌకుంట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. పది వార్డులు ఉండగా 5 జనరల్, 5 బీసీలకు కేటాయించారు. గ్రామంలో 2,060 ఓటర్లు ఉండగా ఇందులో ఎస్సీలకు ఒక్క వార్డు కూడా కేటాయించలేదు. ఈ విషయమై చేవెళ్ల మండల ఎంపీడీవో హిమబిందును వివరణ కోరగా 2011 జనాభా లెక్కల ప్రకారం కౌకుంట్లలో ఎస్సీ జనాభా తక్కువగా ఉంది. గతంలో ఉన్న ఎన్నికల నిబంధల ప్రకారమే రిజర్వేషన్లు చేశారని స్పష్టం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ ఎందుకు చేయాలేదనే అంశంపై కోర్టులో కేసు కొనసాగుతుందని తెలిపారు.

నామినేషన్ వేస్తున్నారా?



రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సర్పంచులు, వార్డుసభ్యుల పదవుల కోసం ఈనెల 27నుంచి 29 వరకు మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో నామినేషన్లు వేసే అభ్యర్థులు అవసరమైన పత్రాలు జత చేయాల్సినవి.

- నామినేషన్ పత్రం (ఫారమ్-2) నిర్దేశించిన ఫారమ్‌ను నింపి, అభ్యర్థి సంతకంతో పాటు, ప్రతిపాదకుని సంతకాలతో దాఖలు చేయాలి.
- ధరవత్తు (డిపాజిట్) రుసుము నిర్ణీత మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో లేదా రిటర్నింగ్ అధికారికి చెల్లించి, దానికి సంబంధించిన రసీదును నామినేషన్ పత్రానికి జతచేయాలి.
- సర్పంచ్ అభ్యర్థికి రూ.1000, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ అభ్యర్థులకు 500రుపాయలు.
- అభ్యర్థి రిజర్వ్ చేయబడిన స్థానం నుంచి పోటీ చేస్తే ప్రభుత్వ నుంచి జారీ చేయబడిన కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా జతచేయాలి.
- అభ్యర్థి తమ ఇంట్లో మరుగుదొడ్డి ఉందని, దాన్ని ఉపయోగిస్తున్నారని తెలిపే స్వీయ ధృవీకరణ పత్రం లేదా పంచాయతీ నుంచి పొందిన ధృవీకరణ పత్రం తప్పనిసరి.
- ప్రమాణ పత్రం లేదా డిక్లరేషన్. తాను ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హుడని తెలిపే డిక్లరేషన్.
- గ్రామ పంచాయతీకి పన్ను బకాయిలు లేవని నో డ్యూస్ సర్టిఫికెట్.
- క్రిమినల్ కేసులు ఏమైనా ఉన్నాయా.. అస్తుల వివరాలు వంటి ముఖ్య సమాచారాన్ని తెలిపే అఫిడవిట్.
- గుర్తింపు, నివాస ధృవీకరణ పత్రాలు, ఓటర్ జాబితాలో పేరు ఉన్నట్లయితే నిరూపించడానికి ఓటర్ ఐడీ లేదా ఇతర గుర్తింపు పత్రాలు తప్పనిసరి.
- నామినేషన్ పత్రాలను దాఖలు చేసేటప్పుడు అన్ని ఒరిజనల్ పత్రాలను ధృవీకరణ కోసం సిద్ధంగా ఉంచుకోవాలి.
- ధృవపత్రాల్లో మార్పులు, చేర్పులు ఉంటే పూర్తి సమాచారం కోసం స్థానిక, జిల్లా ఎన్నికల అధికారులను సంప్రదించాలి.

- కొత్తూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి)

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే దాకా..

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రాజకీయ ప్రస్థానం

కడ్తాల మండలం చల్లంపల్లి సర్పంచ్‌గా రెండు సార్లు విజయం
రెండు సార్లు జెడ్పీటీసీగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపు
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం
రాజకీయ ఎదుగుదలకు సర్పంచ్ పదవే పునాది గా నిలిచిందంటున్న జైపాల్ యాదవ్



ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా గడించిన పాలనానుభవం ఆయనకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడానికి పునాదిగా నిలిచింది. గ్రామస్థాయి రాజకీయాల్లో ఆయన కుటుంబానికి ఆ సర్పంచ్ పదవే చెరగని ముద్ర వేసింది. జడ్పీటీసీగా, బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా.. ఎమ్మెల్యేగా ఇలా అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగేందుకు సర్పంచ్ పదవే తొలిమెట్టుగా నిలిచింది. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ సర్పంచ్ పదవులు అధిరోహించే వారికి ఆదర్శంగా, సర్పంచ్ పదవి ప్రాముఖ్యతను తెలిపేందుకు ఉదారహణగా నిలిచారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం చల్లంపల్లికి చెందిన గుర్కా మంగమ్మ, బల్‌రామ్ దంపతులకు 1954 ఆగస్టు 25న జైపాల్ యాదవ్ జన్మించారు. డిగ్రీ పూర్తి చేసిన ఆయన 1970లో విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రవేశం చేశారు. 1981లో తొలిసారిగా చల్లంపల్లి సర్పంచ్‌గా పోటీ చేసి సమీప ప్రత్యర్థి కృష్ణయ్యపై విజయం సాధించారు. సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేసి ప్రజల అభిమానం చూరగొన్నారు. 1988లో రెండోసారి మళ్లీ సర్పంచ్‌గా పోటీ చేసి మాధవరెడ్డిపై గెలుపొందారు. 1995లో తలకొండపల్లి, 2006లో వంగూరు జడ్పీటీసీ పదవికి పోటీ చేసి విజయం సాధించారు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. 1999లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో మళ్లీ ఎమ్మెల్యేగా అదే పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019లో మళ్లీ తన రాజకీయ చతురతతో బీఆర్ఎస్ టిక్కెట్ సాధించి మూడోసారి అనూహ్య విజయం సాధించారు. తన రాజకీయ ప్రస్థానం, పాలనానుభవం స్థానిక సంస్థల నుంచే మొదలైందని జైపాల్ యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మండల కార్యాలయానికి ఎన్నికల సామగ్రి



త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల స్టేషనరీ, ఇతర సామగ్రి తాండూరు మండల పరిషత్‌కు చేరింది. మండలంలో 33 పంచాయతీలకు సామగ్రిని సిద్ధం చేశారు. ఎన్నికల గైడ్‌లైన్స్, బ్యాలెట్ పేపర్లు, స్వాస్తిక్ ఎంబ్లం, వివిధ రకాల క్లాత్, బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది వినియోగించే ఇతర స్టేషనరీ ఐటంలు కార్యాయానికి తరలించారు. సామగ్రిని కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. మొదటి విడత ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు డిసెంబరు 10న సామాగ్రి తరలిస్తామని అధికారులు పేర్కొన్నారు.

- తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి)



చిన్న నీటి వనరుల గణనపై శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ సుచరిత

నీటి వనరులను పకడ్బందీగా లెక్కించాలి

శామీర్‌పేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి వనరుల లెక్కింపులో నిర్లక్ష్యం లేకుండా పకడ్బందీగా గణన చేయాలని ఎన్యూమరేటర్లకు తహసీల్దార్ సుచరిత సూచించారు. బుధవారం మూడుచింతలపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఏడో చిన్ననీటి వనరుల గణనపై ఆమె ఎన్యూమరేటర్లకు శిక్షణను ప్రారంభించారు. పేపర్ రహితంగా మొబైల్‌యాప్ ద్వారా నీటి వనరుల గణన చేయాలని వివరించారు. గ్రామ పాలన అధికారుల, వ్యవసాయ విస్తరణ అధికారుల, ఇతరుల సహాయంతో నవంబరు 27 నుంచి డిసెంబరు 20వరకు చిన్న నీటి వనరుల గణనను పూర్తి చేయాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజ సేవ చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరి సామాజిక సేవ చేయాలని గురుకుల ఆర్మీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. అంకుశాపూర్ ప్రిన్సిటన్ కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. ప్రజలకు మద్యపాన నివారణ, పారిశుధ్యం, సైబర్ క్రైం, డ్రగ్స్ గంజాయి, బాల్య వివాహాలు, తదితరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కీసర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):అందరి సహకారంతో కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ అన్నారు. కీసరగుట్ట ఆలయంలో అవినీతి జరుగుతోందంటూ కొందరు ట్రస్ట్ బోర్డు సభ్యులు చేసిన ఆరోపణలను ఆయన బుధవారం ఖండించారు. స్వామివారి అభిషేకాల విషయంలో బోర్డు సభ్యులకు, దాతలకు, ప్రముఖులకు, వీఐపీలకు నిబంధనల ప్రకారమే గౌరవమిస్తున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు సమయంలో సభ్యులకు, ఆలయ నిర్వాహకులకు జరిగిన అంతర్గత సంభాషణను కొందరు వక్రీకరించి అంతా అవినీతే జరుగుతోందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అహ్మదాబాద్ వెళ్లాల్సిన విమానం పది గంటలు ఆలస్యం

- ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్ రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అహ్మదాబాద్ వెళ్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ పది గంటలు ఆలస్యమైంది. దీంతో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరాల్సిన 6ఈ 883 ఇండిగో విమానం పైలెట్ రాకపోవడంతో ఎయిర్‌పోర్టులోని ప్రయాణికులు పడిగాపులు కాయల్సిన పరిస్థితి ఏర్పడింది. విమానంలో 191 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎయిర్‌లైన్స్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర పైలెట్‌ను రప్పించడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కొంత మంది ప్రయాణికులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోగా, మరి కొంత మందికి హోటలలో బస ఏర్పటు చేసుకున్నారు. కొంత కాలంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది, పైలెట్లు రాకపోవడంతో చాలా విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమానాలను రద్దు కూడా చేశారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు అభినందనీయం

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బస్సు షెల్టర్ ఏర్పాటు అభినందనీయమని వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో కీ.శే.బూర్గు వెంకటయ్య, మణెమ్మల జ్ఞాపకార్థం బూర్గు జగదీష్, వరలక్ష్మి నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా అవసరాలు తీర్చడంలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతం, లక్ష్మయ్య, వెంకటరమణ, మాణిక్యం, నవీన్‌కుమార్, సురేష్, రాంమోహన్‌గుప్తా, జగదీశ్వర్, పాండురంగం, రమేష్, రఘు, సతీష్, శ్రీనివాస్, వాసు, రాము, సుమన్, నర్సింహులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై స్పెషల్ ఫోకస్



తాండూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పాత తాండూరు ప్రాంతంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ యాదగిరి పారిశుధ్య పనులపై పరిశీలించారు. ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకొని పనులపై ఆరా తీశారు. బసవన్న కట్ట వద్ద కూరగాయ వ్యాపారులు రోడ్డు పక్కన వ్యర్థాలను వేయకుండా సూచనలు చేశారు. ఆయనతో ఏఈ ఉదయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, ఉమేశ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి వంశీ, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ ప్రవీణ్‌గౌడ్, జవాన్లు ఉన్నారు.

మా భూములు తీసుకోవద్దు

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేగడిదోస్వాడలోని సర్వే నంబర్ 102లోని ప్రభుత్వ భూమిని రేగడిదోస్వాడ, మక్తగూడ, వెంకమ్మగూడ, తాళ్లపల్లి రైతులకు గత ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో లో 1954-55లో పంపిణీ చేసింది. వాటిని ఇప్పుడు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు బుధవారం షాబాద్ తహసీల్దార్ అన్వర్‌ను కలిసి వినతిప్రతం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఏళ్లుగా సాగు చేసుకొని బతుకుతున్నామని, ఇప్పుడు భూములను తీసుకుంటే ఎలా బతికేదని వాపోయారు.

జీవోను ఉపసంహరించుకోవాలి

- తహసీల్దార్ ఆజంఅలీకి వినతి

కొందుర్గు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ కోడ్‌లో భాగంగా విడుదల చేసిన జీవోతో తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్, చుక్కమెట్టు, ఉమ్మెంత్యాల, లాలాపేట గ్రామాల రైతులు వాపోయారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ఆజంఆలీకి వినతిపత్రం అందజేశారు. భూములు నమ్ముకొని జీవిస్తున్నామని, ఇప్పుడు ఆ భూములే పోతే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బుయ్యని మహేందర్, నర్సింలు, నర్సింహారెడ్డి, అంజయ్య, నర్సింలు, శేఖర్, రాములు, యాదయ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

'సర్వీస్' టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

కొత్తూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో చట్ట సవరణ ద్వారా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ కోరారు. ఈమేరకు కొత్తూర్‌లో ఆ యూనియన్ మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్‌నాయక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేసి పీఆర్సీ రిపోర్టు ఇవ్వాలని, ప్రమోషన్ల ద్వారా ఏర్పడ్డ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడిగా గౌరయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రిన్స్, సభ్యులుగా శ్రీనివాస్‌రావ్, సాయన్న, అరవింద్, భాస్కర్‌రావులను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రఘుపాల్, సాదత్‌అలీ, బాలకృష్ణ, శ్రీనివాస్‌రావ్, సబిత, సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జీసీడీవో శ్రీదేవి సూచించారు. బుధవారం జాఫర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, వార్డెన్ పద్మ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జీసీడీవో శ్రీదేవి

అభివృద్ధి పనుల్లో రాజీపడొద్దు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఏమాత్రం రాజీపడొద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో రూ.39 కోట్ల టీయూ ఎఫ్ఐడీసీ నిధులతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, పార్కుల నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. స్థానిక పటేల్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కమిషనర్ సునిత, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, రఘునాయక్, చెన్నయ్య, బస్వం, ఇబ్రహీం, కొప్పునూరి ప్రవీణ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

చౌదరిగూడ : మండల పరిధిలోని తూంపల్లికి చెందిన రాజు ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కృష్ణ, రాంచంద్రయ్య, గుట్ట రాజులు పాల్గొన్నారు.

పల్లెల్లో మొదలైన ఎన్నికల హడావుడి

- అభ్యర్థుల ఎంపికకు ప్రధాన పార్టీల కసరత్తు
- సర్పంచ్, వార్డు పదవులపై యువత ఆసక్తి
- ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతతో పోటీ తీవ్రం



గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. పల్లెల్లో రాజకీయ హడావుడి మొదలైంది. ఎన్నికల ప్రకటనపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు తెరపడింది. ఆశావాహుల్లో ఉత్కంఠ మొదలైంది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో బుధవారం ఏ గ్రామంలో చూసినా ఎన్నికల చర్చే వినిపించింది. ఇంతకాలం సర్పంచ్ పదవులపై ఆశలు పెంచుకొని గ్రామాలలో రాజకీయ హడావుడి సాగిస్తున్న ఆశావహులు అభ్యర్థిత్వాల ఖరారుకు ఇక తమ పార్టీ అగ్రనేతల ప్రాపకం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల పరిధిలో 103 గ్రామ పంచాయితీలు.. వాటి పరిధిలో 896 వార్డులున్నాయి. రెండో విడత డిసెంబరు 14న ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలో, 17న మాడ్గుల మండలంలోని పంచాయితీలలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ అనంతరం అదేరోజు సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తారు. ఈనెల 30 నుంచి సర్పంచ్, వార్డుమెంబర్ల పదవులకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటికే రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో ఆయా పంచాయతీల్లో రిజర్వేషన్ వచ్చిన సామాజికవర్గాల నుంచి బరిలో నిలిచేందుకు చాలామంది ఉత్సాహం చూపుతూ.. పావులు కదుపుతున్నారు. జనరల్, మహిళలకు కేటాయించిన స్థానాల్లో పోటీ అధికంగా కన్పిస్తోంది. ఈ దఫా బీసీ రిజర్వేషన్లు తగ్గి జనరల్ స్థానాలు పెరగడంతో జనరల్‌లో పోటీ చేయడానికి చాలామంది ఉత్సాహం కనబరుస్తున్నారు. రాజకీయంగా చైతన్యం కలిగిన కల్వకుర్తి నియోజకవర్గంలో సర్పంచ్ పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. ఇదిలా ఉండగా.. ఎన్నికల నోటి ఫికేషన్ విడుదలతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికకు కసరత్తు వేగం చేసింది. ఆర్థికంగా ఉండి ప్రజాభిమానం కలిగిన వారినే రంగంలో నిలపాలని పావులు కదుపుతున్నాయి. కొన్ని గ్రామాల్లో సర్పంచ్ పదవులకు ముగ్గురు, నలుగురు పోటీ పడుతుండడంతో పార్టీ అగ్రనేతలకు కూడా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారింది. తమ పార్టీలో అవకాశం రాకపోతే ప్రత్యర్థి పార్టీలోకి వెళ్లి అభ్యర్థిత్వాన్ని పొందేందుకు ఆశావాహులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉండకూడదనే నిబంధన ఎత్తివేయడంతో పోటీ మరింత పెరిగింది.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంటికి కన్నం

- 9 తులాల బంగారం, రూ.6 లక్షలు అపహరణ

ఆదిభట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.6లక్షలు, 9 తులాల బంగారాన్ని అపహరించిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. ఆదిభట్ల మున్సిపల్ పరిధి బొంగ్లూర్ రాఘవేందర్ కాలనీలో నివాసముంటున్న అన్నబోయిన శ్రీనివాస్ మంగళవారం హస్తినాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆ తరువాత బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 9 తులాల బంగారం, రూ.6లక్షల నగదు దోచుకెళ్లారు. ఆదిభట్ల క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఇంటికెళ్లి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

- రూ.2 లక్షల విలువైన వెండి కిరీటం, మాల అపహరణ

కందుకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లి గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు బుధవారం ఉదయం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా వున్నాయి. గ్రామంలోని పురాతనమైన ఆంజనేయ స్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.2 లక్షల విలువ గల స్వామి వారి వెండి కిరీటంతో పాటు మాలను దొంగిలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైంగిక దాడి కేసులో నిందితుల అరెస్టు

కొత్తూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అక్కివానిగూడలో ఇటీవల ఓ మహిళపై లైంగిక దాడి చేసి ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి అభరణాలు దోచుకెళ్లిన ఇద్దరు నిందితులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి. నర్సయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన నల్లబోతుల సలేశ్వరం అలియాస్ రాజు(47), అతని బంధువైన ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ప్రాంతానికి చెందిన ఎరుకలి అశోక్(20)లు ఫరూఖ్‌నగర్ మండల బూర్గుల చౌరస్తా వద్ద కల్లు దుకాణం వద్ద ఓ మహిళకు పరిచయమయ్యారు. ఈనెల 22న ఆ మహిళను బైక్‌పై ఎక్కించుకొని అక్కివానిగూడ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అనంతరం ఆమెపై ఇద్దరూ లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆమె వద్ద నుంచి బంగారు, వెండి అభరణాలు దోచుకుని పరారయ్యారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి, నిందితులను పట్టుకోడానికి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. వాహనాల తనిఖీల్లో భాగంగా నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు గోపాలకృష్ణ, సత్యశీలారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఏడాది పాపతో సహా తల్లి అదృశ్యం



భాగ్యమ్మ(ఫైల్)

యాచారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అత్తతో గొడవపడిన వివాహిత ఏడాది వయస్సున్న పాపతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఘటన హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి ముచ్చర్లలో బుధవారం చోటుచేసుకుంది. ముచ్చర్లకు చెందిన భాగ్యమ్మ (23) రెండు రోజుల క్రితం తన అత్త చెన్నమ్మ తో గొడవపడింది. భర్త శ్రీశైలం వారిద్దరికి సర్దిచెప్పినా గొడవ సద్దుమణగలేదు. దాంతో మనస్తాపానికి గురైన భాగ్యమ్మ మంగళవారం తన ఏడాది వయస్సున్న కుమార్తెను తీసుకొని బయటకు వెళ్లిపోయింది. రెండ్రోజులుగా బంధువులు, తెలిసిన చోటల్లా వెతికినా జాడ తెలియలేదు. బుధవారం శ్రీశైలం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

జేసీబీ వాహనాన్ని ఢీకొన్న పెళ్లి కారు

- వివాహానంతరం వధువు ఇంటికి వెళ్తుండగా ఘటన
- తప్పిన పెను ప్రమాదం.. నలుగురికి స్వల్పగాయాలు
- వధూవరులు, డ్రైవర్‌తో పాటు మరో మహిళ సేఫ్



ఘటనా స్థలంలో కారు

చేవెళ్ల, నంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కారు జేసీబీ వాహనాన్ని ఢీ కొట్టడంతో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో చేవెళ్ల-శంకర్‌పల్లి రోడ్డుపై దేవుని ఎర్రవల్లి స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు, పోలీస్‌లు కథనం ప్రకారం.. చేవెళ్ల మండలం రావులపల్లికి చెందిన లక్ష్మీప్రియ(అనూష) వివాహం మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డిగూడకు చెందిన శివకుమార్‌తో బుధవారం ఉదయం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో జరిగింది. అయితే, పెళ్లి తర్వాత సాయంత్రం 6గంటల సమయంలో పెళ్లి కూతురు(రావులపల్లి గ్రామం) ఇంటికి వెళ్లేందుకు కారులో నలుగురు బయలు దేరారు. పెళ్లి జరిగిన ఫంక్షన్‌హాల్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న దేవునిఎర్రవల్లి గ్రామం స్టేజీ సమీపంలో చేవెళ్లకు చెందిన బొలెరో వాహనం బుధవారం ఉదయం నుంచి రోడ్డుపై ఆగిపోగా అక్కడే ఉంది. అయితే, జేసీబీ సాయంతో ఆ వాహనాన్ని రోడ్డు పక్కకు తొలగిస్తున్న క్రమంలో పెళ్లి కారు డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ జేసీబీని ఢీకొట్టాడు. దాంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు కారులో ఉన్న పెళ్లి కుమారుడు శివకుమార్, పెళ్లి కుమార్తె అనూష, మరో మహిళ ఎల్లమ్మకు స్వల్పగాయాలయ్యాయి. కారు ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కాగా, వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందివ్వడంతో పాటు క్షతగాత్రులను చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. జేసీబీ డ్రైవర్ ఇండికేటర్స్ వేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. చేవెళ్ల, శంకర్‌పల్లికి వెళ్లే దారిపై కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీస్‌లు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చౌదరిగూడ,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. బుధవారం ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని బోయగూడకు చెందిన చంద్రయ్య(42) గృహప్రవేశం కోసం మంగళవారం సాయంత్రం చౌడపూర్‌లో ఉన్న పూజారి దగ్గరికి వెళ్లి సామగ్రి రాయించుకొని వస్తానని భార్యకు చెప్పి బైక్‌పై బయల్దేరి వెళ్లాడు. ఈక్రమంలో సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా స్పందించలేదు. అయితే, వీరన్నపేట్ నుంచి పద్మారం వైపు వస్తుండగా భాస్కర్ వ్యవసాయ పొలం వద్ద బైక్‌పై నుంచి కింద పడి చనిపోయినట్లు ఓ వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి చెప్పడంతో కుటుంబ సభ్యులు అక్కడి చేరుకున్నారు. మూలమలుపు వద్ద బైక్ గుంతలో పడిపోయింది. తీవ్రగాయాలై అతడు మృతిచెందాడు. భార్య భారతమ్మ ఫిర్యాదు మేరుకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన బుధవారం శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. శంషాబాద్ మండలంలోని తొండుపల్లి గ్రామ సమీపంలోని ఓఆర్ఆర్ రోడ్డు డివైడర్ మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతి చెందిన వ్యక్తి 45-50 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని గుర్తించారు. వ్యక్తి వారం రోజుల క్రితం ఓఆర్ఆర్‌పై తిరుగుతూ కనిపించగా.. వాహనంలో ఎక్కించుకొని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై వదిలిపెట్టినట్లు పెట్రోలింగ్ సిబ్బంది తెలిపారు. అతడు ఆకలితో లేదా అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

జిల్లావ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రచించి అంబేడ్కర్ పేద ప్రజలకు హక్కులు కల్పించారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



చేవెళ్ల : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కందుకూరు : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



శంకర్‌పల్లిలో మాట్లాడుతున్న ఎస్సై సురేశ్



తలకొండపల్లి : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



షాబాద్ : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



షాద్‌నగర్ రూరల్ : రాజ్యాంగాన్ని చదివిస్తున్న న్యాయాధికారి స్వాతిరెడ్డి

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠాపనోత్సవంలో గ్రామస్తులు

చౌదరిగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని జిల్లేడ్‌లో వేదపండితుల నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. బుధవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, హోమం, అభిషేకం నిర్వహించి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. దైవకార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేయనున్నట్లు గ్రామానికి చెందిన మీదిగడ్డ మాధవి శ్రీనివాస్ దంపతులు తెలిపారు. మాజీ సర్పంచ్ బాబురావు, వెంకటేష్, శశిధర్, తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట



ఎల్వోసీ అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన గురిగల్ల మంజులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 2.75లక్షల ఎల్వోసీ మంజూరైంది. బుధవారం మండల కేంద్రంలో శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు మంకి శ్రీను, రమేశ్, తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల అనంతరం దీక్ష కొనసాగిస్తాం

షాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికల తరువాత దీక్ష కొనసాగిస్తామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు తెలిపారు. ఈమేరకు షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష బుధవారం ముగించారు. వారు మాట్లాడుతూ గత 46 రోజులుగా రిలే నిరహార దీక్షకు సహకరించిన అన్ని కులాలు, కుల సంఘాలు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల అనంతరం బీసీల రిజేర్వేషన్ల కోసం మళ్లీ పోరాడుతామన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, రమేష్‌యాదవ్, చంద్రయ్య, పాండు, రాము, వెంకటయ్య, వెంకటేష్, లింగం, మాసయ్య, తదితరులున్నారు.

నారీ.. సారీ!

(ఐదో పేజీ తరువాయి)

తక్కువ రిజర్వేషన్లు ఖరారుకావడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గత పంచాయతీ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ప్రాతినిధ్యం వహించగా, ఈసారి మాత్రం మహిళల కంటే పురుషులే ఎక్కువగా ఎన్నికయ్యేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే.. మహిళలకు ప్రత్యేకంగా రిజర్వు చేసిన సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు మహిళలే పోటీ చేయనుండగా, అన్ రిజర్వుకు కేటాయించిన సర్పంచ్, వార్డు స్థానాల్లో మహిళలు పోటీ చేయడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా జనరల్ స్థానాల్లో మహిళలు బరిలో దిగుతున్న స్థానాల సంఖ్య అతి స్వల్పమే. ఎక్కడో ఒకటి రెండు చోట్ల మాత్రమే జనరల్ స్థానాల్లో మహిళలు రంగంలో దిగుతున్నారు. ఇదిలా ఉంటే త్వరలో జరిగే పరిషత్ ఎన్నికల్లో మహిళలకు మరిన్ని స్థానాలు తగ్గనున్నట్లు అంచనా.

బీసీ మహిళలకు మరింత అన్యాయం

పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు చట్టబద్ధంగా దక్కాల్సిన 50శాతం స్థానాలు దక్కలేదు. అయితే ఇందులో కొన్ని వర్గాల వారికి మరింత ఎక్కువ నష్టం జరిగింది. జిల్లాలో సర్పంచ్ ఎన్నికల్లో మహిళలకు సగటు 46.95శాతం, వార్డుల్లో 44.64శాతం స్థానాలు మాత్రమే రిజర్వుడయ్యాయి. ఇందులో వార్డుస్థానాల్లో బీసీ మహిళలకు ఎక్కువ అన్యాయం జరిగింది. బీసీ మహిళలకు కేవలం 40.84శాతం మాత్రమే వార్డుస్థానాలు రిజర్వుడు కావడం గమనార్హం. అలాగే ఎస్సీ మహిళలకు 42శాతం, ఎస్టీ మహిళలకు 46.88శాతం, జనరల్‌కు 46.69శాతం స్థానాలు రిజర్వు అయ్యాయి.

నేర రహిత సమాజ స్థాపనకు పాటుపడాలి

తలకొండపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నేరరహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఎస్సైలు శ్రీకాంత్, చంద్రశేఖర్‌లు అన్నారు. చంద్రధన గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన బండెల ప్రవీణ్‌కుమార్ రూ.10 వేలు, రాఘవేందర్ రెడ్డి రూ.5 వేలు సమకూర్చారు. తలకొండపల్లి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఎస్సై చంద్రశేఖర్‌కు అందజేశారు. ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జాషువా, శ్రీనివాస్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, శివాజీ, సత్తయ్య, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మంచాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. చైర్మన్ బూడిద రాంరెడ్డి బుధవారం మంచాల మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీలతరెడ్డి, బీఆర్ఎస్ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు పున్నం రాము, ఆకారపు కృష్ణ, సద్దాం హుస్సేన్, కొత్తపల్లి సాయి గౌడ్, పాలమోని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు సాకిబండ తండా, నుచ్చుగుట్ట తండా, ఎర్రబీక్య తండాలలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ బుధవారం తండా నాయకులు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయా తండాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. రవిరాథోడ్, సత్యనాయక్, రమేశ్ నాయక్, బాలు, భాస్కర్, శివరామ్, తదితరులు ఉన్నారు.

సీఐ జానకి రాంరెడ్డికి సన్మానం

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిప్పిరెడ్డి నారాయణ రెడ్డి బుధవారం ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని సీఐ కోరారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో పోలీసు శాఖ పరంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జానకి రాంరెడ్డి తెలిపారు.



సీఐ జానకి రాంరెడ్డిని సన్మానిస్తున్న నారాయణరెడ్డి

పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



షాద్‌నగర్ రూరల్ : నామినేషన్ పత్రాలను సిద్ధం చేస్తున్న అధికారులు

షాద్‌నగర్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో నేటి(గురువారం) నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలో 15 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికాలను నియమించినట్లు ఎంపీడీవో బన్సీలాల్ తెలిపారు.

కొత్తూర్ : గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డుసభ్యుల పదవుల కోసం నామినేషన్ల స్వీకరణకు స్థానిక అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉండగా నాలుగు నామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నామినేషన్ల స్వీకరణపై ఆర్వో, ఏఆర్వోలకు సిబ్బంది ఎంపీడీవో డాక్టర్ అరుంధతి పలు సూచనలు చేసి నామినేషన్ల సామగ్రి అందజేశారు. ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, ఎంఈవో అంగోర్‌నాయక్, వ్యవసాయాధికారి గోపాల్‌నాయక్, ఎంపీవో విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు చేవెళ్ల మండలంలోని క్లస్టర్లవారీగా స్టేజీ వన్ అధికారులు, ఎన్నికల సహాయ అధికారులు, గ్రామ కార్యదర్శులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నోటిఫికేషన్ వెలువడిందన్నారు. 30 నుంచి డిసెంబరు 2వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 8 క్లస్టర్ల వారిగా సర్పంచ్‌లు, వార్డు సభ్యుల నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో చేవెళ్ల ఎంపీవో విఠలేశ్వర్, ఎంఈవో పురందాస్ తదితరులు ఉన్నారు.

కేశంపేట : గ్రామాలలో పంచాయతీ ఎన్నికల పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై జోనల్, రిట్నరింగ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ తదితరులున్నారు.

కేశంపేట : మండల పరిధిలో 9 కేంద్రాలలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లను నేటి నుంచి స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

చౌదరిగూడ : ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలు పాటించాలని ఎన్నికల మాస్టర్ ట్రైనర్ గోవర్ధన్ సూచించారు. చౌదరిగూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జీపీల వారిగా ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఏవో రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమనగల్లు : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ బాక్స్‌లు బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. డిసెంబరు 14న ఆమనగల్లు మండలంలో.. 13 గ్రామ పంచాయతీలు 112 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 149 బ్యాలెట్ బాక్స్‌లు కందుకూరు ఆర్డీవో కార్యాలయం నుంచి ఆమనగల్లుకు చేరుకున్నాయి. ఎంపీడీవో మాధురి పరిశీలించి భద్రపరిచారు.

కొందుర్గు : డిసెంబరు 11న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆర్వో, ఏఆర్వోలతో పాటు ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల మాస్టర్‌ట్రైనీ ఆఫీసర్ ఆశీర్వాదం అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మీ అనురాధ, ఎంపీవో విజయ్‌కుమార్ పాల్, సూపరింటెండెంట్ భిక్షపతి, ఎస్సై రవీందర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పోరు

(ఐదో పేజీ తరువాయి)

గడువు విధించారు. ఆ తరువాత ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా రూపొందించి గుర్తులతోపాటు రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. 11వ తేదీ గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తొలి విడత ఎన్నికల పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే వెంట వెంటనే ఫలితాలు ప్రకటించనున్నారు. అంతేకాకుండా అదేరోజు ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. ఇదిలా ఉంటే షెడ్యూల్ విడుదలైనందున ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ సంబంధమైన నిధుల నుంచి గ్రాంట్లు, నిధుల చెల్లింపులు నిలిచిపోయాయి. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు కొత్త పనులు, నిధులు మంజూరుకు బ్రేక్ పడింది.

తొలి విడత ఇక్కడే..

తొలి విడత షాద్‌నగర్, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఏడు మండలాల్లో 174 పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. కొత్తూరు మండలంలో 12 పంచాయతీల్లో 110 వార్డులు, నందిగామ మండలంలో 19 పంచాయతీల్లో 170 వార్డులు, కేశంపేట్ మండలంలో 29 పంచాయతీల్లో 260 వార్డులకు, సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. కొందుర్గు మండలంలో 22 పంచాయతీల్లో 186 వార్డులు, చౌదర్‌గూడ మండలంలో 24 పంచాయతీల్లో 204 వార్డులు.. ఫరూఖ్‌నగర్ మండలంలో 47 పంచాయతీల్లో 410 వార్డులు, శంషాబాద్ మండలంలో 21 పంచాయతీల్లో 190 వార్డులకు, సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.

తొలి విడత

నోటిఫికేషన్	: నేడే(నవంబరు 27)
నామినేషన్లు	: 27 నుంచి 29వ తేదీ వరకు
పరిశీలన, జాబితా	: నవంబరు 30
ఉప సంహరణ	: డిసెంబరు 3
అభ్యర్థుల తుది జాబితా	: డిసెంబరు 3
పోలింగ్	: డిసెంబరు 11 (అదే రోజు ఫలితాల ప్రకటన, ఉపసర్పంచ్ ఎన్నిక)

ధైర్య సాహసాలకు గుర్తింపు సంతోషకరం

శంషాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధైర్య సాహసాలకు గుర్తింపునివ్వడం సంతోషకరమని, ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్-పాకిస్తాన్ మధ్య పరస్పర దాడులు జరుగుతున్న సమయంలో 2025 మే 6,7వ తేదీల్లో పాకిస్తాన్‌కు చెందిన టెర్రరిస్టులు కశ్మీర్‌లోని ఉరి జల విద్యుత్ ప్రాజెక్టులపై దాడి చేయడానికి యత్నించారని, ప్రాణాలకు తెగించి వారిని మట్టి కరిపించిన 19మంది సీఐఎస్ఎఫ్ అధికారులకు సోమవారం ఢిల్లీలోని సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీజీ డిస్క్ అవార్డులను అధికారులందజేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సీఐఎస్ఎఫ్ డీఐజీ ఎస్‌కే మోహంకా హర్షం వ్యక్తం చేశారు. దేశ సంరక్షణలో సీఐఎస్ఎఫ్ సిబ్బందిది కీలక పాత్ర అన్నారు.

శంకర్‌పల్లికి పెద్ద సంస్థలు రావడం హర్షణీయం : ఎమ్మెల్యే



హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

శంకర్‌పల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో దూసుకుపోతున్న శంకర్‌పల్లికి అంతర్జాతీయంగా పేరున్న పెద్ద పెద్ద సంస్థలు ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. బుధవారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తాహౌస్ హోటల్‌ను పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలు, పిస్తాహౌస్ ఫౌండర్ ఎండీ అబ్దుల్ మజీద్‌తో కలిసి ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. శంకర్‌పల్లి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.